సాక్షి
సిద్దిపేట
గురువారం । 8 । జూన్ । 2023



సింగూరు చేపతో 'మృగశిర'

పర్యాటకులు చేపలతో చేసిన విందుకు తహతహలాడుతుంటారు. చేపలు అంతటా దొరుకుతున్నా సింగూరు డ్యాంలో దొరికే చేపకు రుచే వేరని కితాబిస్తుంటారు. 8లో..



ప్రతీ నీటిబొట్టు అమూల్యమైంది

సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల ద్వారా నీరు అందించడంతో రైతులు పండించిన ధాన్యం దిగుబడిలో రూ.100కోట్ల టర్నోవర్ దాటిందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. 9లో..

బస్‌పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేటకమాన్: విద్యా సంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్ పాస్‌లను అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు రిజిస్టర్డ్ రుసుం చెల్లించి డీఎం నుంచి పాస్‌వర్డ్ పొందగలరని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా చెరువుల పండగ

జెడ్పీ సీఈఓ రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతీ గ్రామంలో చెరువుల పండగ ఘనంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో చెరువుల పండగ గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ప్రతీ చెరువు వద్ద వేడుకలు నిర్వహించాలన్నారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం ఎన్నో మార్పులు తెచ్చిందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయం పండగలా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ రామచంద్రం, ఎంపీడీఓ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్



ఎస్.శ్వేత, సిద్దిపేట పోలీస్ కమిషనర్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి జూన్ 15వ తేదీ ఉదయం 6గంటల వరకు ఈ నిబంధన అమల్లో ఉంటుందన్నారు. ఈ సమయాల్లో పోలీసుల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదన్నారు. సౌండ్‌సిస్టమ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ శాఖ సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ మ్యాథ్స్ 2, పీజీటీ బయోసైన్స్ 1, పీజీటీ ఇంగ్లిష్ 1, పీజీటీ ఉర్దూ1, పీఈటీ 1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్‌లో ఇంగ్లిష్ 1, మ్యాథ్స్ 1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. వీటితో పాటు హౌస్‌కీపర్ ఒక పోస్టు ఉందని వీటికి మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 9న సాయంత్రం 5గంటల లోపు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ప్రగతిని గుర్తు చేసేలా గడియారాలతో ప్రచారం



గోడ గడియారాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకటౌన్: దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 9 ఏళ్లలో సీఎం కేసీఆర్ సాధించిన అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిని నిరంతరం ప్రజలకు గుర్తుండేల, ప్రతీ ఇంట్లో తెలియజేసేలా సదుద్దేశంతో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి గోడ గడియారాలతో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా గోడ గడియారాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ దుబ్బాకలో బీజేపీ, కాంగ్రెస్‌ల అసత్య ప్రచారాలకు చెక్ పెట్టేల ప్రత్యేక వ్యూహంతో ముందుకు పోతున్నామన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన దుబ్బాకలో ఎగిరేది గులాబి జెండాయేనని అన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను తొలగించి విద్యార్థులను బీసీ హాస్టల్ భవనంలోకి పంపే సమయంలో త్వరలో హాస్టల్‌కు నూతన భవనం నిర్మిస్తామని చెప్పిన జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఐదేళ్ల నిరీక్షణకు తెర

- 9 నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ
- జిల్లాలో 412 సంఘాలు.. 32,452 మంది సభ్యులు
- మొదటి విడతలో 15,720 మందికి పంపిణీ
- రెండో విడతలో 16,732 మంది లబ్ధిదారులకు అందజేత



నంద్యాలలో గొర్రెలను కొనుగోలు చేస్తున్న లబ్ధిదారులు, అధికారులు

సాక్షి, సిద్దిపేట: గొర్రెల పెంపకందారుల నిరీక్షణకు తెరపడనుంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న సంక్షేమ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెంపకందారులకు సబ్సిడీపై గొర్రెలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2017, జూన్‌లో మొదటి విడత పంపిణీ చేశారు. రెండో విడత కోసం లబ్ధిదారులు ఎదురు చూడాల్సి వచ్చింది. ఎట్టకేలకు గొర్రెల పంపిణీకి జూన్9న రంగం సిద్ధం చేశారు.

రెండో విడతలో 16,732 మందికి పంపిణీ

- జిల్లాలో మొత్తం 412 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 32,452మంది సభ్యులు ఉన్నారు.
- 2017సంవత్సరంలోనే పంపిణీ చేయాల్సిన దాన్ని విడతల వారీగా ఎంపిక చేశారు.
- మొదటి విడతలో 15,720, రెండో విడతలో 16,732 మందికి పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మొదటి విడత పంపిణీ చేసినప్పుడే రెండో విడత పంపిణీ ఉంటుందని గొర్రెల పెంపకందారులు ఎదురు చూసి ఆశలు వదులుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గొర్రెల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గొర్రెల పెంపకందారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యూనిట్ ధర పెంపు

ప్రభుత్వం గొల్లకురుమలకు 75శాతం సబ్సిడీ కింద ఒక యూనిట్‌కు 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలు పంపిణీ చేస్తోంది. 2017లో ఒక్కో యూనిట్‌కు రూ.1,25,000 నిర్ణయించారు. అందులో లబ్ధిదారుడు రూ.31,250 డీడీ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.25లక్షలతో 21 గొర్రెలు రాకపోవడంతో మరో రూ.50 వేలు పెంచుతూ యూనిట్ ధరను రూ.1.75లక్షలుగా నిర్ణయించారు. రెండో విడతలో 16,732 మందికిగాను ఇప్పటి వరకు సబ్సిడీ పోను మిగతా డబ్బులు 5,756మంది డీడీలు కట్టారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఏపీలోని కర్నూల్ జిల్లా, కర్ణాటకలోని బళ్లారిలో కొనుగోలు చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆదేశించింది. ఈ నెల 9న మొదటి రోజు ప్రతీ నియోజకవర్గంలో ఆరుగురికి చొప్పున గొర్రెలు, మరో పది మందికి మంజూరు పత్రాలు అందజేసేందుకు పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసం సిద్దిపేట నియోజకవర్గం నుంచి మల్యాలకు చెందిన ఆరుగురు, గజ్వేల్ నుంచి సిరిగిరిపల్లి, దుబ్బాక హబ్సిపూర్, హుస్నాబాద్ పందిళ్లకు చెందిన ఆరుగురు చొప్పున కర్నూల్‌కు వెళ్లారు. ప్రత్యేక అధికారిగా మైన్స్ ఏడీ రాఘవరెడ్డి నేతృత్వంలో 24 మంది లబ్ధిదారులు వెళ్లారు.

> **9న గొర్రెల పంపిణీ**
>
> దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 9న రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాల్లోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో పంపిణీ చేసేలా సన్నాహాలు చేస్తున్నాం. గొర్రెల కొనుగోలుకు పలుటీంలు కర్నూల్‌కు వెళ్లాయి.
>
> – జగత్ కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ప్రతీ ఒక్కరికి ఆరోగ్యంపై అవగాహన



5కె రన్‌లో క్రీడాకారులతో సీఐ, పోలీస్ సిబ్బంది

త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో 5కె రన్

సిద్దిపేటఅర్బన్: ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీఐ భానుప్రకాశ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం 3టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో బక్రిచెప్యాల గ్రామంలో 5కె రన్ నిర్వహించినట్టు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా ప్రతీ ఒక్కరికి ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ప్రతిరోజు యోగా, రన్నింగ్, వాకింగ్, ధ్యానం వంటివి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యాం సుందర్, ఎంపీటీసీ బోనాల రంగం తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యాసంస్థలను రద్దు చేయాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజునాయక్



మాట్లాడుతున్న రాజునాయక్

హుస్నాబాద్: అనుమతులు లేని విద్యా సంస్థలను రద్దు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశాడు. బుధవారం సిద్దిపేటలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యతరగతి పిల్లలకు విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలుకు పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్యం నాయక్, జిల్లా కార్యదర్శి మోతిలాల్ నాయక్, ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కృష్ణనాయక్, గిరిజన అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు వైద్య సలహాలు



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి హెల్త్ ప్రొఫైల్‌పై సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు సలహాలు, సూచనలు ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, సీపీ శ్వేత ఆధ్వర్యంలో డాక్టర్ క్రాంతికుమార్ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వారి ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలియజేశారు. ప్రతీ రోజు చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన ఆహారం, వ్యాయామం, యోగా, వంటి వాటిగురించి వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసులకు ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరికి మొదటి దశలో ఎత్తు, బరువు, రెండో దశలో బ్లడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షించారు. మూడో దశలో వారి ఆరోగ్య స్థితి, అలవాట్ల గురించి గూగుల్ షీట్ తయారు చేశారన్నారు. వాటి ఫలితాల ఆధారంగా పోలీసులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వైద్యులు పలు సలహాలు, సూచనలు చేశారన్నారు. అనంతరం విమలాథామస్ మాట్లాడుతూ హోంగార్డు నుంచి అధికారుల వరకు అందరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రాంతికుమార్ ప్రొఫెసర్ మధు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ చందర్, వన్ టౌన్ సీఐ బిక్షపతి, రూరల్ సీఐ జానకీరామ్‌రెడ్డి, ఆర్‌ఐలు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీన జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం



సిద్దిపేటకమాన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం అన్నారు. సిద్దిపేట కోర్టులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్‌లో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 12,553 క్రిమినల్ కేసులు ఉన్నాయని వీటిలో 2,778 కాంపౌండబుల్ కేసులు ఉన్నాయని, వీటిలో 795 కేసులు గుర్తించి 652కేసులకు నోటీసులు సర్వ్ చేశారన్నారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గం ద్వారా సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.



ఐటీ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

ఐటీ కంపెనీల భాగస్వామ్యం సంతోషకరం

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: జిల్లాలో నిర్మించిన ఐటీ టవర్‌లో ప్రముఖ ఐటీ కంపెనీలు భాగస్వామ్యం కావడం సంతోషకరమని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధులతో ఐటీ టవర్ ప్రారంభం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, హరీశ్‌రావుల ఆలోచన మేరకు జిల్లాలో నిర్మించిన ఐటీ టవర్‌లో ప్రముఖ ఐటీ కంపెనీలు భాగస్వామ్యం కావడం సంతోషదాయకమన్నారు. ఐటీ టవర్‌లో ఓఎస్ఐ డిజిటల్, జోలాన్ టెక్, విసన్ ఇన్ఫో టెక్, అమిడాయ్ ఎడ్యుటెక్, ఫిక్సిటీ టెక్నాలజీస్, ఇన్నోసోల్, థోరాన్ టెక్నాలజీస్, బీసీడీసీ క్లౌడ్ సెంటర్స్, ర్యాంక్ ఐటీ సర్వీసెస్, తదితర కంపెనీలు భాగస్వాములు అవుతున్నట్లు తెలిపారు. దీంతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వారు వివరించారు. హైదరాబాద్ నుంచి అతి సమీపంలో ఉన్న సిద్దిపేట ఐటీ టవర్ ఆహ్లాదకరమైన వాతావరణంలో, రాజీవ్ రహదారిపై ఉందన్నారు. త్రీస్టార్ హోటల్, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, పోలీస్ కమిషనరేట్ ఉండటంతో పటిష్టమైన శాంతి భద్రతల నిర్వహణతో ఎలాంటి సమస్యలు లేకుండా ఉంటుందని చెప్పారు. తమతో కలిసి వచ్చే కంపెనీలకు ఎలాంటి రాయితీలు కావాలన్నా ఇచ్చేందుకు ప్రభుత్వ పరంగా కలెక్టరేట్, అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమీక్షలో ఐటీ కంపెనీ ప్రతినిధులు, సిద్దిపేట ఐటీ టవర్ నిర్వాహకులు చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

12కు ముందే సర్దుబాటు చేయాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల విషయంలో సరైన విధానం రూపొందించి జూన్ 12కు ముందే సర్దుబాటు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌లు అన్నారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయంలో సెక్టోరియల్ ఆధికారి రామస్వామికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రాగిజావ పంపిణీకి స్కూల్ పాయింట్‌లోనే మెటీరియల్‌ను అందించాలన్నారు. హెచ్ఎంలను స్కూల్‌యూనిఫారాలను కుట్టించేందుకు కాకుండా వాటిని పంపిణీ ప్రక్రియకు మాత్రమే వాడుకోవాలని సూచించారు. ఉచిత పుస్తకాలన్నింటిని స్కూల్ ప్రారంభానికి ముందే పంపిణీ చేయాలన్నారు. 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

రాష్ట్ర రూపురేఖలు మారాయి

వ్యవసాయ రంగంలో అగ్రగామిగా తెలంగాణ



కాళేశ్వరంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్: కాళేశ్వరం ప్రాజెక్టుతో నేడు తెలంగాణ రూపురేఖలే మారిపోయాయని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మలు అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో వారు మాట్లాడారు. ఒకప్పుడు కరువు, కాటకాలకు నిలయంగా ఉన్న రాష్ట్రం నేడు వ్యవసాయరంగ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా మారిందన్నారు. భారీగా రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు ప్రతీ చెరువును గోదావరి జలాలతో నింపడం వల్ల భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయన్నారు. ప్రపంచంలోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రత్యేక గుర్తింపును పొందిందని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సాగునీటి రంగంలో అద్భుతమైన విజయాలను సాధించామన్నారు. పదేళ్ల తెలంగాణ ప్రగతిని చాటి చెప్పే క్రమంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నీటి పారుదశాల శాఖ ఈఎన్‌సీ హరేరాం, 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఎస్ఈ వేణు, రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తితోనే కాళేశ్వరం ప్రాజెక్ట్

రంగనాయకసాగర్ వద్ద సాగునీటి దినోత్సవంలో మంత్రి హరీశ్ రావు



ఉత్తమ ఇంజనీర్‌గా ఖాజాకు అవార్డు అందజేస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట: సీఎం కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ఏర్పడకముందు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే ఇప్పుడు మూడు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందన్నారు. దేశం మొత్తం భూగర్భ జలాలు అడుగున పడిపోతే తెలంగాణలో 7.5మీటర్ల పైకి భూ గర్భ జలాలు చేరాయన్నారు. సిద్దిపేటలో రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో బుధవారం రాత్రి సాగునీటి దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హరీశ్ రావు హాజరై మాట్లాడుతూ నది లేకుండా ఒక ప్రాజెక్ట్ ఉందంటే అది మానవ నిర్మితమైన మల్లన్నసాగర్ ఒక్కటే అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం దేశ రాజధాని ఢిల్లీలో పర్యావరణ అనుమతి కోసం ఆఫీసుల చుట్టూ ఓపికగా తిరిగిన రోజులు ఉన్నాయని గత జ్ఞాపకాలను గుర్తు చేశారు.

రెండు నెలల్లో సిద్దిపేటకు రైలు

చిన్నకోడూరు(సిద్దిపేట): రెండు నెలల్లో సిద్దిపేటకు రైలు వస్తుంది..తిరుపతి, హైదరాబాద్ మధ్య ఒక రైలు సిద్దిపేట మీదుగా వెళ్లేలా చూస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ మధ్యలో సాగునీటి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంగనాయక సాగర్‌కు మెట్రో నగరాల వాళ్లు వచ్చేలా ఒక పర్యాటక ద్వీపం తరహాలో మార్చుతామన్నారు. వంద కోట్లతో అద్భుత డెస్టినేషన్ సెంటర్ తరహాలో తీర్చిదిద్దుతామన్నారు. రంగనాయక సాగర్ ఒడ్డున ఆర్టిఫిషియల్ బీచ్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఒకప్పుడు తెలంగాణలో వ్యవసాయం దండగ అనే స్థితి ఉందని, ఇప్పుడు ఒక పండగలా మారిందన్నారు. రైతులు సేద్యం పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. ఒకప్పుడు ఎడారిగా ఉన్న తెలంగాణ ఈ రోజు ఒక అద్భుతమైనటువంటి ఆవిష్కరణ చూస్తున్నామన్నారు. ప్రజల జీవన విధానంలో మార్పు, జీవన శైలిలో మార్పు రావడం మంచి సంకేతమన్నారు. ఐదేండ్ల తరువాత తెలంగాణ మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రముఖ వైద్యులు రాంచందర్‌రావు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడిపై పీడీ యాక్ట్



అశోక్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): అమాయక బాలికలను టార్గెట్ చేస్తూ లైంగిక దాడులకు పాల్పడుతున్న యువకుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన కొండగల్ల అశోక్(22) కళాశాల విద్యార్థిగా తోటి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇప్పటికే ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి పాల్పడగా, పోక్సో కేసులు రెండు నమోదు చేసినట్టు రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. యువకుడిని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానిత వ్యక్తి పోలీసులకు అప్పగింత

నర్సాపూర్: పట్టణంలో రాత్రిపూట అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నాలుగో వార్డులోని శివాజీ విగ్రహం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఒకరు అనుమానంగా తిరగడాన్ని కొందరు యువకులు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. వివరాలు అడగ్గా సరైన సమాధానం రాకపోవడంతో పాటు అతని వద్ద నంది విగ్రహం ఉండడంతో అతనిపై అనుమానాలు కలిగి 100 నంబర్‌కు ఫోన్ చేశారు. పోలీసులు రాగానే వారికి అతడిని అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి గాయాలు



ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని కల్బెమల్ గ్రామానికి చెందిన శోభ ఆమె తమ్ముడు రాజులు బుధవారం మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో రుక్మాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో వారు బైక్ పై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మల్లన్నకుంట కబ్జాపై విచారణ

అక్కన్నపేట(హుస్నాబాద్): మల్లంపల్లి- చౌటపల్లి గ్రామాల శివారులోని మల్లన్నకుంట కబ్జాపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం వివిధ పత్రికల్లో వచ్చిన వార్త కథనాలకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కలిసి కుంటను సందర్శించి పరిశీలించారు. రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఆర్‌ఐ రాజు, సిబ్బంది కలిసి వెళ్లి, రైతు దగ్గర ఉన్న పూర్తి ఆధారాలను వెంటతీసుకొని రెవెన్యూ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. దీంతో అమ్మిన రైతు, కొనుగోలు చేసిన వ్యక్తిని రాత్రి వరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఇరిగేషన్ శాఖ ఏఈ రమ్యశ్రీ ఉపేందర్‌పై అక్రమంగా కుంట కట్టను ధ్వంసం చేసి ఆక్రమించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

సింగూరు చేపతో 'మృగశిర'

- చేపలతో నోరూరించే వంటకాలు
- వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్న కుటుంబాలు
- మత్స్యకారులకు చేతినిండా పని

పుల్‌కల్(అందోల్): మృగశిర కార్తె వచ్చిందంటే సింగూరు చేపలకు భలే గిరాకీ. ఈ రోజు సింగూరు చేపలతో చేసిన కూర రుచి చూస్తే ఏడాదంత ఆరోగ్య సమస్యలు తలెత్తవని, ముఖ్యంగా జలుబు వంటి వ్యాధులు దరిచేరవని ప్రజల నమ్మకం. అంతే కాకుండా ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకు చేపలతో విందు భలే పసందుగా ఉంటుంది. పర్యాటకులు చేపలతో చేసిన విందుకు తహతహలాడుతుంటారు. చేపలు అంతటా దొరుకుతున్నా సింగూరు డ్యాంలో దొరికే చేపకు రుచే వేరని కితాబిస్తుంటారు.



సింగూరు ప్రాజెక్టు వద్ద చేపల విక్రయాలు

- మృగశిర కార్తె నాడు లక్షల్లో చేపల వ్యాపారం జరుగుతుంది. సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, మునిపల్లి, పుల్‌కల్ మండలాలు కాకుండా సింగూరు పరీవాహకం చుట్టు పక్కల ఉన్న నారాయణఖేడ్, మనూరు, న్యాల్‌కల్, రాయికోడ్ తదితర గ్రామాల ప్రజలు ఈ చేపలతో రకరకాల వంటలు చేస్తుంటారు.
- సింగూరు డ్యామ్ మంజీరా నదిపై నిర్మించారు. ఈనది పరీవాహక ప్రాంతం మెట్ట భూములతో నిండి ఉండటం, మహారాష్ట్రలోని పర్వత శ్రేణుల్లో నుంచి వస్తుండటంతో మంజీరా నదిలో మినరల్ శాతం ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మంజీరా నదిపై నిర్మించిన సింగూరు డ్యామ్‌లో ఉత్పత్తి అయ్యే చేపలు రుచికరంగా ఉంటాయని జిహ్వ చాపల్యం ఉన్న వారు ఉవ్విళ్లూరుతుంటారు.
- జిల్లాలో ఏకైక భారీ ప్రాజెక్టు సింగూరు కావడంతో మత్స్యకారులు చేపల వృత్తిని జీవనాధారంగా చేసుకుని ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు మత్స్యశాఖ చేపల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వడంతో సింగూరు డ్యాంలో చేపల ఉత్పత్తికి ప్రాముఖ్యత ఏర్పడింది. డ్యాం ఎగువన మంజీరా నది పరీవాహకంపై 20 కిలోమీటర్ల మేర విస్తరించడంతో చేపల ఉత్పత్తికి డిమాండ్ పెరిగింది. ఈ డ్యాంలో నాలుగు రకాల చేపలు పెరుగుతున్నాయి. కొర్రమీను, తెల్లచేప, బొచ్చ వంటి చేపలు అందుబాటులో ఉన్నాయి.
- సింగూరు డ్యాంలో ప్రభుత్వం ఏటా 60 లక్షల పైచిలుకు చేప పిల్లలను విడుదల చేస్తున్నాయి. దీనికి తోడు సహజంగా ఉత్పత్తి అయ్యే చేపలు అదనం. దీంతో లక్షల సంఖ్యలో చేపలు పెరుగుతున్నాయి. డ్యాం పరీవాహక ప్రాంతం ఎక్కువగా ఉండటం, స్వచ్ఛమైన నీరు ఉండటం, చేపలు ఈదటానికి 20 కిలోమీటర్ల మేర పరీవాహక ప్రాంతం కలిగి ఉండటంతో చేపలు నాణ్యతతో పెరుగుతున్నాయి. దీంతో సింగూరు చేప రుచికరంగా ఉంటుందనేది అభిప్రాయం.
- సింగూరు ప్రాజెక్టు ఎగువ, దిగువ గ్రామాలలో ప్రభుత్వం గుర్తించిన మత్స్యకారులున్నాయి. వందల సంఖ్యలో ఉన్న ఈ మత్స్యకారులు సింగూరు డ్యాంపైనే ఆధారపడి చేపలు పట్టుకుంటూ ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం చేపలు పట్టడానికి అవసరమైన వలలు, వాహనాలు, క్రమ విక్రయాల సామగ్రి రాయితీపై అందిస్తుండటంతో వాటిని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందుతున్నారు.
- సింగూరు జలాశయంలో వివిధ రకాల చేపలు పెరుగుతున్నాయి. ఈ చేపలతో రుచిరకమైన వంటలు చేస్తూ పర్యాటకులకు పసందైన విందును అందించటానికి డ్యాం సమీపంలో కొన్ని కుటుంబాలు గుడారాలు వేసుకున్నాయి.
- రోజుకు టన్నుల కొద్ది చేపలతో రుచికరమైన వంటలు చేస్తున్నారు. సింగూరు జలశయంలో చేపలు పట్టే మత్స్యకారులతో పాటు, రుచికరమైన వంటలు చేస్తూ మరి కొన్ని కుటుంబాలు ఉపాది పొందుతున్నాయి.



చేపలతో వంటకాలు

చేపకూరలతో మృగశిరకు స్వాగతం



మృగశిరకార్తె రోజు చేపలు తినాలని ఆనవాయితీ ఉంది. ఈరోజు ప్రతీ ఇంటిలో చేపలతో ప్రత్యేక వంటలు చేస్తాం. సింగూరు చేపలు రుచికరంగా ఉండటంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. ఈకార్తె నాడు చేపలతో పలురకాల వంటకలు చేస్తాం. సింగూరు చేపలంటే కుటుంబ సభ్యులు బాగా ఇష్టపడతారు.
– సత్యనారాయణ, ముద్దాయిపేట

విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ: ప్రతి పోలీస్‌అధికారి తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్ ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా సిబ్బందితో నెలవారీ నేర సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ ఉన్న కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ వివరాలు తెలిపారు. ప్రతి అధికారికి పూర్తి స్టేషన్ మేనేజిమెంట్ తెలిసి ఉండాలన్నారు. అధికారులకు, సిబ్బందికి తరచు క్షణ తరగతులు నిర్వహించి వారి పనితనాన్ని మరింత మెరుగుపర్చాలన్నారు. ఈ సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, ఆర్‌ఐ నాగేశ్వర్‌రావుతోపాటు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

బెస్ట్ అవైలబుల్‌కు 34 మంది విద్యార్థుల ఎంపిక

మెదక్ కలెక్టరేట్: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 34మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కలెక్టరేట్‌లో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, ఆర్డీఓ సాయిరాంలు పాల్గొని విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 3వ తరగతిలో 17 మంది, 5వ తరగతిలో 9 మంది, 8వ తరగతిలో 8 మందిని ఎంపిక చేశారు. ఇందులో బాలికలు 11మంది, బాలురు 23 మంది ఉన్నారు. కాగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

నకిలీ సీబీఐ అధికారుల అరెస్ట్



నిందితులతో పోలీసులు

కొండాపూర్(సంగారెడ్డి): మల్కాపూర్ చౌరస్తా వద్ద నకిలీ సీబీఐ అధికారులను కొండాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొండాపూర్ ఎస్ కథనం ప్రకారం.. ఈనెల 2వ తేదీన మండల పరిధిలోని తేర్పోల్‌లో మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన ప్రమీల తన కూతురు సిరి చందనతో కలిసి ఇంట్లో ఉంది. ఓ కారులో పురుషుడు, ఇద్దరు మహిళలు వచ్చి తాము సీబీఐ అధికారులమని పరిచయం చేసుకున్నారు. మీ ఇంటిని తనిఖీ చేయాలంటూ బలవంతంగా ఇంట్లో దొరబడ్డారు. ఇంట్లో సామాను చిందరవందరగా పడేశారు. దీంతో ప్రమీల మీరు ఎవరు? ఎందుకు ఇలా చేస్తున్నారని గట్టిగా ప్రశ్నించడంతో అందులో ఓ మహిళ ప్రమీల చెంపపై కొట్టింది. ప్రమీల అరవకుండా మరో మహిళ నోట్లో గుడ్డలు పెట్టి ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును గుంజుకొని పరారయ్యారు. ప్రమీల భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఐదు రోజులుగా నిందితుల కోసం గాలిస్తున్న క్రమంలో బుధవారం మల్కాపూర్ చౌరస్తా వద్ద అనుమానస్పదంగా ఉన్న సాయిజాదవ్‌ను విచారించడంతో నేరం ఒప్పుకున్నాడు. అతడికి సహకరించిన అందోల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కారు డ్రైవర్ విఠల్, తేర్పోల్ గ్రామానికి చెందిన గౌస్, సదాశివపేట మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

అప్పులు తీర్చే మార్గం కనిపించక...

కొండపాక(గజ్వేల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముంద్రాతి వేణు(28) మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ పుశ్పరాజ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల గ్రామానికి చెందిన ముంద్రాతి రాములు రెండో భార్య కుమారుడు వేణు ప్రైవేట్ జాబ్ చేసేవాడన్నారు. అతనికి 4 నెలల కిందట వివాహమైందని, దీంతో తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడని తెలిపాడు. అప్పులు తీర్చే విషయంలో మదనపడుతూ ఈనెల 5వ తేదీ సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు వంటిమామిడి సమీపంలోని లక్ష్మక్కపల్లిలో గల ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడన్నారు. ఈ మేరకు మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



వేణు(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గాయపడి

మునిపల్లి(అందోల్): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన సార విఠల్ మేకలకు మేత తేవడానికి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి లూనాపై వెళ్లాడు. లూనాను రోడ్డు పక్కన నిలిపి వస్తుండగా, రాయికోడ్ మండలానికి చెందిన ఒకరు అతివేగంగా వచ్చి సార విఠల్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన విఠల్‌ను కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు...

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేటలోని రంగధాంపల్లి గ్రామానికి చెందిన రాగం రఘు (58) వ్యవసాయంలో సరైన దిగుబడి లేకపోవడం, ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టం జరగడంతో మనో వేదనకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి పురుగుల మందు తాగాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో కుమారుడు సాయికుమార్ బావి వద్దకు వెళ్లి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతుడి కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

దేవతల కుచ్చెలో తవ్వకాలు



కిందపడి ఉన్న కాలబైరవ విగ్రహం

టేక్మాల్(మెదక్): దేవతల కుచ్చెలో గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపారు. ఈ ఘటన మండలపరిధిలోని వెల్పుగొండలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని తుంబురీశ్వరాలయ ప్రాంగణంలోని చెరువు మధ్యలో ఉన్న దేవతల గుట్ట(కుచ్చె)లో గంబర కాలబైరవుని విగ్రహం కొలువై ఉంది. వారంరోజుల క్రితం గ్రామస్తులు తుంబురీశ్వర ఆలయంలో రాత్రి భక్తులు భజన చేస్తుండగా దేవతలకొండపై లైట్లు వెలగడాన్ని గమనించారు. విషయం ప్రజాప్రతినిధులు చెప్పగా, అందరూ అక్కడకు వెళ్లి చూడగా దుండగలు పరారయ్యారు కాలబైరవుడి విగ్రహాన్ని తవ్వి పక్కన పెట్టారు. పెద్దపెద్ద తాళ్లు, కట్టెలు, తెల్లటి దోతులు, రాళ్లు పగులగొట్టి నుక్కులు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే ఆ విగ్రహాన్ని తరలించడానికి ప్రయత్నించారు. గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అపహరణ, హత్యాయత్నం కేసులో..

నలుగురి అరెస్ట్, రిమాండ్

పటాన్‌చెరు టౌన్: అపహరణ, హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులను పటాన్‌చెరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన అనంతమ్మ పటాన్‌చెరు గౌతంనగర్ కాలనీకి చెందిన శాంతమ్మ కుటుంబాలకు గత కొంతకాలంగా వికారాబాద్ జిల్లా నోవాపేటలో ఉన్న భూమి విషయంలో వివాదం నడుస్తోంది. తనకు కూడా ఆస్తిలో వాటా వస్తుందని శాంతమ్మ వికారాబాద్ సివిల్ కోర్టులో కేసు వేసింది. ఈనేపథ్యంలో రుద్రారం గ్రామానికి చెందిన అనంతమ్మ రెండో కుమారుడు శ్రీను గ్రామ శివారులో గీతం విశ్వవిద్యాలయం బాలికల వసతి గృహం వెనుక చెరువు పక్కన అనూహ్యంగా చనిపోయాడు. శాంతమ్మ భర్త నారాయణ భూవివాద నేపథ్యంలో హత్యచేశాడని శ్రీను కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో 6వ తేదీ సాయంత్ర సాకి చెరువు సమీపంలో ఉన్న సైకిల్ షాపు వద్ద నారాయణ సైకిల్ కు పంక్చర్ వేయించుకుంటున్నాడు. అదే సమయంలో కారులో మృతుడు శ్రీను తండ్రి కిష్టయ్య, సోదరుడు రాజు, వారి ఇంటి పక్కన ఉన్న రమేశ్, స్కూటీపై మరోసోదరుడు సత్తెయ్య, తల్లి అనంతమ్మ, భార్య సంతోష వచ్చి నారాయణపై దాడిచేసి ఎందుకు చంపావురా అంటూ అతడిని కారులో ఎత్తుకెళ్లి రుద్రారంలోని వారి ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించారు. నారాయణను కట్టెలతో కొట్టి చంపుతామని బెదిరించారు. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి నారాయణను కాపాడారు. నిందితులు రాజు, రమేశ్, సత్తెయ్య, సంతోషను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గొంతు కోసి.. గొలుసు ఎత్తుకెళ్లి

సిద్దిపేటరూరల్: గొలుసు కోసం ఓ వృద్ధురాలి గొంతు కోసి హత్య చేశారు. చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో బాలగోని లింగవ్వ (80) ఇంటి వద్దనే ఉంటుండగా, ఆమె బాగోగులను గ్రామంలోని బంధువైన కలవ్వ చూసుకుంటోంది. రోజు మాదిరిగానే కలవ్వ బుధవారంఉదయం టిఫిన్ ఇచ్చి వెళ్లింది. సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చి చూడగా లింగవ్వ రక్తపు మరకలతో మంచంపై పడి ఉండడాన్ని గమనించింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మెడలోని బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగింది. దీంతో దుండగులు అక్కడే ఉన్న కొడవలితో వృద్ధురాలి గొంతుకోసి గొలుసును అపహరించారు. మెడపై కొడవలితో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమైన లింగవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ శివానందంలు వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీం సిబ్బందికి సమాచారం అందించగా, వేలిముద్రలు, ఆనవాళ్లు చేశారు. ఈ ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.



లింగవ్వ మృతదేహం

ఆన్‌లైన్‌లో బెదిరింపులు



సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్‌లో ఓ లోన్ యాప్ ద్వారా తీసుకున్న డబ్బు చెల్లించినా కూడా మళ్లీ చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటన హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..

- హుస్నాబాద్ పరిధిలో ఓ వ్యక్తి లోన్‌యాప్ ద్వారా రూ.2,09,856 లోన్ తీసుకుని తిరిగి మొత్తం డబ్బు చెల్లించాడు. కానీ గుర్తు తెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్ చేసి ఇంకా లోన్ డబ్బులు చెల్లించాలని లేదంటే బాధితుడి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఇన్‌స్టాగామ్‌లో ఫోన్ ఆర్డర్ చేసి

- గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో రూ.10వేలు చెల్లించి ఓ మొబైల్ ఫోన్‌ను ఆర్డర్ చేశాడు. తర్వాత అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో తను మోసపోయినట్టుగా గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఫ్లిప్‌కార్ట్ పేరుతో

- గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు తన ఖాతా నుంచి రూ.7,780 ఫ్లిప్‌కార్ట్ పేరుతో డబ్బులు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. బాధితుడు వెంటనే ఫ్లిప్‌కార్ట్ కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేయగా వారు పరిశీలించి బాధితుడి ఖాతా హ్యాక్ అయినట్లు తెలిపారు.
- చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఫాస్ట్ వాలెట్ లోన్ యాప్ ద్వారా డబ్బులు వచ్చినట్లు మెసేజ్ వచ్చింది. అది నిజమా ? కాదా ? అని బాధితుడు ఆ లింకును ఓపెన్ చేయగా రూ.2వేలు ఖాతాలో జమ అయినట్లు, ఈఎంఐ చెల్లించాలని మెసేజ్ ఉంది. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి హిందీలో అసభ్యకరంగా మాట్లాడుతూ డబ్బులు చెల్లించకపోతే అతడి, కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ప్రైవేటు ఉద్యోగికి రూ.6.85 లక్షలకు టోకరా

పటాన్‌చెరు టౌన్: ఆన్ లైన్ యూట్యూబ్ లింకులు క్లిక్ చేస్తే నగదు వస్తుందని, అదేవిధంగా టాస్కులు పూర్తి చేస్తే 30 శాతం కమీషన్ ఇస్తామని ఆశ చూపి సైబర్ మోసగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగిని మోసం చేశారు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం పరిధిలోని విలమేలకు చెందిన రాయిశెట్టి వేణు ప్రైవేటు ఉద్యోగి. మే 22 వ తేదీన అతడి వాట్సాప్ నంబర్‌కు ఆన్‌లైన్ లింక్ క్లిక్ చేస్తే నగదు ఇస్తామంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. అపరిచితులు చెప్పిన విధంగా ముందుగా రూ.2 వేలు నగదు పెట్టుబడి పెట్టగా రూ.2800 ఇచ్చారు. అనంతరం టాస్కులు పూర్తి చేస్తే 30% కమీషన్ ఇస్తామని ఆశ చూపగా బాధితుడు పలు దుఫాలుగా రూ.6.85 లక్షలు పంపాడు. బాధితుడు తను ఇన్వెస్ట్ చేసిన నగదుతో కమీషన్ ఇవ్వమని అడగడంతో వారు స్పందించ లేదు. దీంతో తాను మోసపోయినట్లు బాధితుడు గ్రహించి ముందుగా సైబర్ పోలీసులకు, అనంతరం బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వలలో ఇద్దరు గృహిణులు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళలు సైబర్ వలో చిక్కుకుని మోసపోయారు.

- అమీన్‌పూర్‌కు చెందిన ఓ మహిళకు మే 25వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్కులు చేస్తూ వచ్చింది. చివరికి ఆ మహిళ తాను పెట్టిన రూ.57,800లకు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో పాటు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.
- అమీన్‌పూర్ పరిధిలోని కేఎస్‌ఆర్ కాలనీకి చెందిన మహిళకు మే 29వ తేదీన పార్ట్ టైం ఉద్యోగమంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ తన వివరాలను అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నమోదు చేసి నగదు పెడుతూ టాస్కులు చేస్తూ వచ్చింది. చివరకు తాను పెట్టిన రూ.1,48,972లకు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కొడుకు సంసారం బాగా లేదని ఓ తండ్రి, భర్తతో గొడవ పడి ఓ భార్య, అనారోగ్యంతో బాధపడుతూ మరొకరు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు.

కొడుకు సంసారం బాగా లేదని...

కొండపాక(గజ్వేల్): కొడుకు సంసారం బాగాలేదని మనస్థాపానికి గురై తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ మండలంలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుశ్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల గ్రామానికి చెందిన పిట్ల భూపాల్‌కు 3 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహం అయిన కొద్ది రోజులకు భూపాల్ భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయంలో పలుమార్లు పంచాయతీ పెట్టినా భార్య సంసారానికి రాలేదు. దీంతో కొడుకు సంసారం బాగుపడటం లేదని తండ్రి యాదగిరి(70) మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో గ్రామంలోని డబుల్ బెడ్రూం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కొడుకు భూపాల్ ఫిర్యా దు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



యాదగిరి మృతదేహం

అనారోగ్యంతో..

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని బయ్యారంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారంలోని చర్చి కాలనీకి చెందిన బీరెడ్డి ఆంతోనిరెడ్డి(54)కి భార్య ధనలక్ష్మితో పాటు కూతురు ఉన్నారు. ఆంతోనిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లోని బాత్‌రూమ్‌లో నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తతో గొడవ పడి..

చిలప్‌చెడ్(నర్సాపూర్): భర్తతో గొడవపడి ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన నదరి లక్ష్మి (38) భర్త భూమయ్య పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. మంగళవారం ఉదయం దంపతుల మధ్య గొడవ జరగడంతో ఇంటి నుండి వచ్చిన లక్ష్మి చిలప్‌చెడ్ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మహ్మద్‌గౌస్‌ను వివరణ కోరగా మృతదేహాన్ని పరిశీలించామని, మృతురాలి కుటుంబసభ్యులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోస్టుమార్టంకు తరలిస్తామన్నారు.